సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఎన్నికల పాఠం 2లో▸

విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం, ఓటు హక్కు విలువను తెలియజేసేందుకు ప్రభుత్వం పదో తరగతి సాంఘికశాస్త్రంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టింది.



వరికోతలు షురూ..

వానాకాలం సీజన్‌లో సాగైన వరిపంట కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. మరో పక్షం రోజుల్లో వరికోతలు ముమ్మరం కానున్నాయి. 3లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /21.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి



సూచనలు చేస్తున్న బిశ్వజిత్ దత్తా

బెల్లంపల్లి: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా అన్నారు. సోమవారం బెల్లంపల్లిలో గుర్తించిన పలు పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన కోసం సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో పోలింగ్ కేంద్రంలో వంద శాతం పోలింగ్ జరిగేలా చూడాలని అన్నారు. ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా పోలింగ్ ఏజెంట్లు సహకరించాలని కోరారు. ఓటు హక్కు ప్రాధాన్యతను ఓటరు తెలుసుకోవాలని, ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని తెలిపారు.

ప్రతీ ఓటు విలువైనది..

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతీ ఓటు అమూల్యమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ పీపుల్ అవగాహన కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి కె.చిన్నయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లు, హెచ్‌ఐవీ పాజిటివ్ బాధితులు ప్రతి ఒక్కరూ ఓటు విలువైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. స్నేహ సొసైటీ రూరల్ రి కన్‌స్ట్రక్షన్, స్నేహ టీఐ ప్రాజెక్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. సోమవారం బెల్లంపల్లి నుంచి నెన్నెల మండలానికి వెళ్తుండగా పోచమ్మగడ్డ చెక్‌పోస్టు వద్ద ఆపి ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే కారులో ఉండి పోలీసులకు సహకరించారు. తనిఖీ అనంతరం వాహనాన్ని పంపించి వేశారు.

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీల్లో విద్యార్థులు రాణించాలని డీఈవో యాదయ్య అన్నారు. ఈ నెల 15, 16న హైదరాబాద్ సీసీఆర్‌టీలో నిర్వహించిన కళోత్సవ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులకు సోమవారం డీఈవో యాదయ్య మెమొంటో, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి పది అంశాల్లో విద్యార్థులు పాల్గొనగా.. ఇండి జీనియస్ టాయ్స్ అండ్ గేమ్స్ అంశం బాలికల విభాగంలో ముత్యంపల్లి జెడ్పీఎస్ఎస్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బిందుప్రియ, బాలుర విభాగంలో నరేందర్, సోలో డ్రామా బాలికల విభాగంలో మంచిర్యాల కేజీబీవీ తొమ్మిదో తరగతి విద్యార్థిని మనీషా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించారని తెలిపారు. ఇన్‌స్ట్రూమెంటు మ్యూజిక్ మెలోడీ బాలుర విభాగంలో బజార్‌ఏరియా జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన రత్నకుమార్ ద్వితీయ స్థాయం సాధించారని పేర్కొన్నారు. శాస్త్రీయ నృత్యం బాలుర విభాగంలో జన్నారం స్లేట్‌స్కూల్‌కు చెందిన అమిత్‌కుమార్ తృతీయ స్థానం, విజువల్ ఆర్ట్స్ త్రీడీలో బెల్లంపల్లి కేజీబీవీకి చెందిన స్ఫూర్తి కన్సొలేషన్ బహుమతి అందుకున్నారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికతోపాటు ప్రశంసాపత్రాలు, షీల్డ్ అందజేశారు. విద్యార్థులతోపాటు పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసరు స్వప్న, గైడ్ టీచర్ బండ శాంకరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి చౌదరి, సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ సీతారాంపల్లి హెచ్‌ఎం పద్మజా, గైడ్ టీచర్ రత్నం, నర్మదా, మౌనిక, ఆసియా పాల్గొన్నారు.

అక్కడే గెలుపు బాట!

- ప్రతీ నియోజకవర్గంలో ఒకే చోట అధిక ఓట్లు
- జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనే ఎక్కువ ఓటర్లు
- అక్కడే దృష్టి సారించి అభ్యర్థుల ప్రచారం
- గెలుపోటములను ప్రభావితం చేస్తున్న ప్రాంతాలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతీ శాసనసభ నియోజకవర్గంలో ఓట్ల పరంగా ఓ గుండెకాయ లాంటి ప్రాంతం ఉంది. అక్కడే అత్యధికంగా ఓటర్లు ఉండడంతో ప్రతీ ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తోంది. అభ్యర్థి గెలవడంలో ప్రతీ ఓటు ముఖ్యమే కానీ.. ఒక ప్రాంతంలోనే ఆ నియోజకవర్గ సగం ఓటర్లు అక్కడే ఉండడంతో అభ్యర్థులకు కీలకంగా మారుతోంది. అధిక ఓట్లు ఉన్న అలాంటి ప్రాంతాలపైనే ప్రత్యేక దృష్టి సారించి అన్ని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఒక అభ్యర్థి గెలిచేందుకు వచ్చే ఓట్లన్నీ ఒకే చోట ఉండడంతో ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. ఆ కారణంగా ఎక్కువగా రోడ్‌షోలు, సభ, సమావేశాలు, అగ్ర నాయకులతో ప్రచార సభలు ఓట్లు ఎక్కువగా ఉన్న చోట్లనే ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఉమ్మడి జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాల్లో ఓట్లు అత్యధికంగా ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తే ఆ ప్రాంత ప్రాముఖ్యత తెలియజేస్తుంది.

ఆ ప్రాంతాల్లోనే అధికం

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఉన్న ప్రాంతాల్లో ఇక్కడే ఓట్లు అధికంగా ఉన్నాయి. ఉదాహరణకు మంచిర్యాల నియోజకవర్గం చూస్తే జిల్లా కేంద్రంలోనే దాదాపు 34శాతం ఓట్లు ఉన్నాయి. ఆ తర్వాత నస్పూర్ పట్టణంలో అధికంగా ఉన్నాయి. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, బోథ్, బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రాల్లోనే అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. ఇక ముథోల్ పరిధిలో భైంసాలో, చెన్నూరు పరిధిలో మందమర్రి, సిర్పూర్‌లో కాగజ్‌నగర్, ఖానాపూర్‌లో ఉట్నూరులో మెజార్టీ ఓటర్లు ఉన్నారు. జనసాంద్రత అధికంగా ఉన్న చోట్లు, ఉద్యోగ, ఉపాధి కోసం స్థిరపడడంతో ప్రతీ నియోజకవర్గంలో 30నుంచి 40శాతం ఓట్లే ఇక్కడే ఉన్నాయి. దీంతో రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, బహిరంగ సభలు, ఎక్కువ ప్రచారాలు ఈ ప్రాంతాలపై దృష్టి సారించాయి. ఇక తక్కువ ఓట్లు ఉన్న ప్రాంతాలను ఆ ఓట్లకు తగినట్లుగా సమయం కేటాయిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు, నియోజకవర్గం మొత్తం తిరగలేని వారంతా కూడా ఎక్కువగానే ఈ ప్రాంతాలపైనే దృష్టి సారించారు. డిపాజిట్లు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నియోజకవర్గం	ఎక్కువ ఓట్లున్న ప్రాంతం	ఓట్లు(వేలల్లో)	మొత్తం ఓట్లు(లక్షల్లో)
ఆదిలాబాద్	ఆదిలాబాద్అర్బన్	97	2.40
సిర్పూర్	కాగజ్‌నగర్	93	2.26
మంచిర్యాల	మంచిర్యాల	92	2.74
నిర్మల్	నిర్మల్అర్బన్	85	2.53
ముథోల్	భైంసా	79	2.49
చెన్నూరు	మందమర్రి	75	1.88
బెల్లంపల్లి	బెల్లంపల్లి	63	1.73
ఖానాపూర్	ఉట్నూర్	48	2.20
ఆసిఫాబాద్	ఆసిఫాబాద్	44	2.26
బోథ్	బోథ్	36	2.08

వినోద్‌కు పక్కలో బల్లెం!

- గెలుపు భ్రమలోనే ఉంచుతున్న నాయకులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో నిండా ముంచిన వైనం
- ఓట్ల కోసం ఇక్కడే ఉంటానని ప్రమాణాలు
- బెల్లంపల్లిలో ఆసక్తికరంగా వినోద్ రాజకీయం



మాజీ మంత్రి వినోద్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం వినోద్‌కు సొంత పార్టీలో కొందరి నాయకుల అత్యుత్సాహం పక్కలో బల్లెంల మారిందా? మనమే గెలుస్తామనే భ్రమ ఆయనకు మరోసారి చేటు చేస్తుందా? అనే ప్రశ్నలకు జవాబులు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుంటూ ఊపు మీద ఉన్న కాంగ్రెస్ పార్టీకి బెల్లంపల్లిలో మాత్రం ఆ గాలి ఎటు వైపు వీస్తోందోనని సందేహాలు వస్తున్నాయి. వినోద్ ఆర్థికంగా ఉన్న నాయకుడిగా జనంతోపాటు నాయకులు, కార్యకర్తల్లో ముద్రపడ్డారు. ఎన్నికల వేళ పార్టీలో చేరుతున్న వారిలో ఎక్కువగా ఏదో ఆశించి చేరుతున్నారని ఆ పార్టీ లీడర్లే అంటున్నారు. కొందరు అభిమానంతో ఉన్నారు. ఇంకొందరు ఆయన ప్రత్యర్థితో వైరంతో ఇటు వైపు చేరారు. మరోవైపు ఇన్నాళ్లు టికెట్ ఆశించి భంగపడిన గ్రూప్‌లో పనిచేసిన వారంతా ఇప్పటికిప్పుడు వినోద్ గెలుపు కోసం మనస్ఫూర్తిగా పని చేస్తున్నారా? అంటే చెప్పలేని పరిస్థితి ఉంది. వినోద్ గెలిస్తే తమ రాజకీయ భవిష్యత్‌కు ఇబ్బంది కలుగుతుందని భావించే వారు ఆయన వెనకాలే ఉండి ఏం చేస్తారనే సందేహాలు ఉన్నాయి.

నమ్మకం ఎంతవరకు?

నియోజకవర్గంలో కొందరు నాయకులు ఎవరు ఎటు వైపు పని చేస్తున్నారో ప్రశ్నార్థకంగా మారింది. పైకి జై కొడుతూనే అటు, ఇటు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పూటకో పార్టీ మార్చుతూ అనుమానాస్పదంగా మారారు. ధనవంతుడనే ఆశతో ఎన్నికల వేళ లబ్ధి కోరి చేరి, తీరా అనుకున్నది దక్కకపోతే మేలు కంటే కీడు చేసే వారు లేకపోలేదు. ఈ క్రమంలో గత ఎన్నికల్లో లాగే ఆయన్ని మళ్లీ ముంచేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2018ఎన్నికల్లో వినోద్ చెన్నూరు నుంచి టీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఆశించారు. టికెట్ దక్కక ఆ పార్టీ వీడి కాంగ్రెస్ నుంచి పోటీకి ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. చివరకు బీఎస్పీ నుంచి తొలిసారిగా బెల్లంపల్లి బరిలో నిలిచారు. నాడు, నేడు ప్రధాన ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతిలో వినోద్ ఓటమి పాలయ్యారు. చిత్రంగా ఆ సమయంలో వినోద్ పక్కాగా గెలుస్తారని ప్రచారం జరిగింది. సర్వేలు అదే విషయం వెల్లడించాయి. ముఖ్యంగా ఏపీకి చెందిన మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ పోలింగ్‌కు ముందు చేసిన ప్రీపోల్ సర్వేలో తెలంగాణ ఫలితాలు అంచనా వేస్తూ, బెల్లంపల్లిలో వినోద్ గెలుపు పక్కా అని చెప్పడంతో అంతా అదే భ్రమలో ఉండిపోయారు. కానీ ఫలితాల్లో బోల్తా పడ్డారు. సొంత నాయకులే డబ్బులు తీసుకుని తనను ఓడగొట్టారని వినోద్ ఆవేశంగా మాట్లాడిన ఘటనలు ఉన్నాయి. తాజాగా నాటి పరిస్థితులకు భిన్నంగా ఇప్పుడేమి లేవనే విశ్లేషకులు భావిస్తున్నారు. అదే ఎన్నికల్లో మహాకూటమి తరఫున పోటీ చేసిన సీపీఐ సీనియర్ నాయకుడు గుండా మల్లేశ్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చినా ఘోరంగా ఓడిపోయారు. ప్రస్తుతం సీపీఐ మద్దతు ఇస్తున్న, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయనేది ఆసక్తికరమైన అంశంగా మారింది.

చల్లారని లోకల్ 'చిచ్చు'

వినోద్ నియోజకవర్గంలో ఉండరనే పెద్ద అపవాదు మూటగట్టుకున్నారు. ఈసారి ప్రచారంలో నేను ఇక్కడే ఉంటానని పదే పదే చెబుతూ ప్రమాణాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇదే తీరుగా ఇక్కడే ఉంటాననే హామీలు ఇచ్చి కనిపించకుండాపోయి, ఎన్నికల సమయానికే వచ్చారని నాయకులే అంటున్నారు. ఇప్పటికీ బెల్లంపల్లిలో కాకుండా మంచిర్యాల నుంచే ప్రచారానికి వస్తూ వెళ్తున్నారు. మరోవైపు ఇక్కడే ఉంటామని వినోద్ సతీమణి రమాదేవి, కూతురు వర్షతో ప్రచారం చేయిస్తున్నారు. ఈ ప్రమాణాలను ఓటర్లు ఎంతవరకు నమ్ముతున్నారనేది వచ్చే ఫలితాలే చెప్పనున్నాయి. స్థానికంగా ఉన్నవారికే గెలిపించాలనే ప్రత్యర్థి వర్గం ప్రచారం చేస్తున్న తరుణంలో ఓట్లు ఎటు మల్లుతాయో వేచి చూడాలి. రూ.కోట్లు కుమ్మరిస్తున్న వినోద్ ఈసారైనా గెలుపు తీరం చేరుతారా? అని నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది.



మంచిర్యాల విశ్వనాథస్వామి ఆలయంలో భక్తుల పూజలు



దండేపల్లి: సత్యనారాయణ వ్రతాలు నోముతున్న భక్తులు

దండేపల్లి/మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో కార్తీక సోమవారం సందడి నెలకొంది. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు చేశారు. సత్యదేవుణ్ని దర్శించుకోవడంతోపాటు పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. అనంతరం రావిచెట్టు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి. మంచిర్యాల పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు విశేష పూజలు నిర్వహించారు. విశ్వనాథస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం వేళ ఆకాశదీపాలు వెలిగించారు.

ఓటు.. ప్రజాస్వామ్య హక్కు

మంచిర్యాలటౌన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్యం మనకు కల్పించిన హక్కు సద్వినియోగం అవుతుందని ప్రభుత్వ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రతీసారి ఎన్నికల్లో వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘంతోపాటు జిల్లా అధికారులు ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వంద శాతం ఓటింగ్ నమోదు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటేనే మనవంతు బాధ్యతను నెరవేర్చినట్లు అని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల వాయిస్

ఓటు వేయడం బాధ్యత



ప్రజాస్వామ్య రక్షణ, భావితరాల భద్రత కోసం వజ్రాయుధం వంటి ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరులందరి బాధ్యత. మన ప్రాంతం అన్ని రంగాల అభివృద్ధికి ప్రధాన కారణం మనం వేసే ఓటే శక్తిగా పనిచేస్తుంది. ఐదేళ్లు మనకు మరింత మెరుగైన జీవనాన్ని ఇచ్చేది కేవలం నిజాయతీ గల ఓటు మాత్రమే. పోలింగ్ రోజు ఎక్కడున్నా, ఓటు హక్కు ఉన్న చోటుకు వచ్చి ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలి.

– గుండేటి యోగేశ్వర్, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు, మంచిర్యాల

ఆషామాషీగా చూడొద్దు



ఓటంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఐదేళ్ల ప్రగతికి అచ్చమైన బాట. మీ నిర్లక్ష్యం ఎందరి భవిష్యత్ మీదనో ప్రభావం చూపుతుంది. ఓటు హక్కు మన అస్థిత్వానికి ప్రతీక. ఓటు మన దగ్గరున్న అత్యంత విలువైన ఆయుధం. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా అభివృద్ధికాంక్ష గల నాయకులను ఎన్నుకుని చట్టసభలకు పంపుదాం. ఓటు విలువను మన చుట్టుపక్కల వారికి చాటిచెప్పి, అందరితో ఓటు వేయిద్దాం.

– అల్లాడి శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్, మంచిర్యాల

ఆలోచించి వేయాలి



ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఆలోచించి వేయాలి. ఎన్నికల సంఘం కల్పించిన హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఉంటూనే, ఎవరో చెప్తేనో, ఏదో ఇస్తేనో ఓటు వేస్తాను అనే భావన నుంచి దూరంగా ఉండాలి. ఓటు హక్కు వచ్చిందంటే స్వయంగా మనం ఆలోచించే వారిమని అర్థం. ఓటు హక్కు ఉన్న వారిలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి ఓటును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి.

– రవికిరణ్‌రెడ్డి, అటవీశాఖ ఉద్యోగి, మంచిర్యాల

వేయకుంటే ప్రశ్నించలేం



ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే, మనం ప్రశ్నించే హక్కును పొందుతాం. ఓటు వేయని పక్షంలో, మనకు కావాల్సిన వాటిని హక్కుగా అడగలేం. ఓటును నోటుకు అమ్ముకోకుండా, అన్ని రకాలుగా ఆలోచించి, ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, వందశాతం ఓటింగ్ జరిగేందుకు ప్రతి ఒక్కరు ముందకు రావాలి.

– పత్తి సత్తయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మంచిర్యాల

యువత ఆలోచించాలి



మన దేశం ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగింది. ప్రజలచేత ఎన్నుకోబడే ప్రభుత్వాలతోనే ఐదేళ్ల పాలన ఉంటుంది. ఓటు వేసే ప్రతి ఒక్కరూ విచక్షణతో, పచ్చనోటుకు, ఉచిత పథకాల ఊరడింపులకు, మద్యం మత్తుకు బానిసగా మారి ఓటు వేయవద్దు. యువత సైతం మనం ఎన్నుకునే నాయకుడు ఎలాంటి వారు, వారిని ఎన్నుకోవడంతో ఏమేరకు పాలన చేస్తారనే దానిని బాగా ఆలోచించి ఓటు వేయాలి. – వేదాంతం విశ్వప్రసాద్, తెలుగుపండిట్, చెన్నూర్

ప్రజాస్వామ్యం నిలబడేటట్టు



కురిపిస్తున్న వరాలను కాదు....
నెత్తిపై మోపే భారాన్ని చూడు
మైమరిపించే మాటలు కాదు...
మురిపించిన సందర్భాలు చూడు
అందించే లక్షలు కాదు....
చేస్తున్న భక్షణ చూడు
తాత్కాలిక కాంక్షలు కాదు... భావితరం రక్షణ చూడు
బుద్ధిగా వేయి నీ ఓటు..... ప్రజాస్వామ్యం నిలబడేటట్టు

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు వారికి ఏమి కావాలో పూర్తి అవగాహన ఉండి, వాటిని సాధించుకునేందుకు ఎవరికి ఓటు వేయాలో నిర్ధారించుకుని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

– బొల్లవరం జగన్ మోహన్‌రావు, టీచర్, మంచిర్యాల

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి



ముల్కల్లలోని లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి సంతోష్, అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా పోలీసు పరిశీలకులు ఆర్ ఇలాంగోతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, ప్రవర్తన నియమావళిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో 152 మంది, చెన్నూర్ నియోజకవర్గంలో 40 మంది, మంచిర్యాల నియోజకవర్గంలో 138 మందికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ నెల 24, 25, 26న అత్యవసర సేవల నిమిత్తం జిల్లాలోని నియోజకవర్గాల్లో రిటర్నింగ్, పోలింగ్ అధికారులు, పరిశీలకులు, వీడియో సర్వేలైన్స్ బృందాలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లా పోలీసు పరిశీలకులు ఇలాంగో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సమస్యల పరిష్కారం, ఫిర్యాదుల కోసం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు జైపూర్‌లోని ఎస్‌టీపీపీ అతిథి గృహంలో అందుబాటులో ఉంటానని, 8143694203 నంబరులో సంప్రదించాలని, ఎన్నికల శాంతిభద్రతల ఫిర్యాదులకు వాట్సాప్ నంబరు 9497997900లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విధులు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని, శిక్షణ ద్వారా ఎన్నికల నిర్వహణ సులభతరం అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి బి.సంతోష్ అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ, ఇతర ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరతగతుల ఏర్పాట్లను మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 21, 22న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహిస్తామని తెలిపారు.

లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ అన్నారు. హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సోమవారం పర్యవేక్షించారు. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల ప్రక్రియను పరిశీలించి సూచనలు చేశారు. కేంద్రం చుట్టూ ఫెన్సింగ్, లెక్కింపు రోజు వచ్చే అభ్యర్థులు, అధికారుల వాహనాల పార్కింగ్, ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపర్చడం, లెక్కింపు కేంద్రంలో చేపట్టాల్సిన అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, పంచాయతీరాజ్ ఈఈ స్వామిరాజ్, ఏఈ కామేశ్వర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ హరిత, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలోపడి వ్యక్తి మృతి


రాజలింగు (ఫైల్)

జన్నారం: ప్రమాదవశాత్తు బావిలోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన జువ్వాడి చిన్న రాజలింగు (48) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 17న ఇంట్లోనుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామానికి చెందిన ముజ్జన్న గ్రామ సమీపంలోని తన పత్తిచేనులో నీరు పెట్టేందుకు వెళ్లగా బావిలో మృతదేహం తేలియాడుతోంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

నస్పూర్(మంచిర్యాల): పట్టణ పరిధిలోని జాతీయ రహదారి 363 బైపాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రవికుమార్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కాసిపేట మండలం సోమగూడెం లంబాడీతండాకు చెందిన బోడ శంకర్ (35) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జైపూర్‌లోని గురుకుల ఎస్సీ హాస్టల్‌లో చదువుకుంటున్న తన కుమారుడిని సోమవారం ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి హాస్టల్‌లో దింపి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారిపై సీహెచ్‌పీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని బంధువు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏరియాస్పత్రిలో నవజాత శిశువు మృతి

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి ఓ నవజాత శిశువు మృతి చెందింది. లోకేశ్వరం మండలం నగర్‌కు చెందిన రజిత ప్రసవం కోసం ఆదివారం మధ్యాహ్నం ఆస్పత్రికి రాగా వైద్యులు సహజ ప్రసవం కోసం ప్రయత్నించారు. రాత్రి 11 గంటల సమయంలో నొప్పులు తీవ్రం కావడంతో ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. అనంతరం శిశువు మృతిచెందినట్లుగా తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయమై సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను వివరణ కోరగా గర్భిణికి ఫిట్స్ రావడంతో పాటు శిశువు మెడకు పేగు చుట్టుకుని ఉండడంతో మృతి చెందినట్లు తెలిపాడు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో ని కేసీబీ గార్డెన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో రాంనగర్ కాలనీలో జాతీయ రహదారిపై ఈ నెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల మండలంలోని బట్టిసావర్‌గాం గ్రామానికి చెందిన నరేందర్ ఆదిలాబాద్ వైపు నుంచి కేసీబీ గార్డెన్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో నరేందర్ కింద పడిపోవడంతో తీవ్ర గాయలయ్యాయి. చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

పాఠ్యపుస్తకంలో ఎన్నికల పాఠం

- పదో తరగతి సోషల్ పుస్తకంలో పాఠ్యాంశం
- విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యంపై అవగాహన

జంగ్ తెలంగాణ

నిర్మల్ ఖిల్లా: విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం, ఓటుహక్కు విలువను తెలియజేసేందుకు ప్రభుత్వం పదోతరగతి సాంఘికశాస్త్రంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఎన్నికల సమయంలోనే ఈ పాఠ్యాంశం సిలబస్‌లో ఉండడం విశేషం. ఇందులో ఎన్నికల వ్యవస్థ నుంచి ఓటుహక్కు వినియోగం వరకు విద్యార్థులు సులభతరంగా అర్థం చేసుకునేలా పాఠ్యాంశంలో రూపొందించారు. ప్రజాస్వామ్యదేశంలో ఎన్నికల అవసరాన్ని గుర్తించి 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడిందని, ఇది స్వయం ప్రతిపత్తి సంస్థ అని వివరించారు. 1952లో నిర్వహించిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో 17.32 కోట్లమంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 67 కోట్లు దాటిందని, ఎన్నికల నిర్వహణకు సివిల్ సర్వీస్‌లకు చెందినవారు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉంటారని పాఠ్యాంశంలో పేర్కొన్నారు. దీంతోపాటు ఎన్నికల సంఘం దేశంలో సుమారు 45 లక్షల మంది సిబ్బందితో భారీ ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తోందని విద్యార్థులకు ఈ పాఠ్యాంశం ద్వారా తెలియజేశారు.

కమిషన్ విధులు..

ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం ప్రధాన పాత్ర పోషిస్తుంది. గతంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పనిచేసిన టీఎన్ శేషన్ ప్రజల అభిమానాన్ని చూరగొన్న తీరును వివరించారు. రాజ్యాంగంలోని 15వ భాగంలోని ఆర్టికల్ 324 నుంచి 329 వరకు ఎన్నికల సంఘం నిర్మాణం, విధులను వివరించారు. ఓటర్ల జాబితాను రూపొందించడం మొదలు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ తేదీల ఖరారు, ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియమావళిని పొందుపర్చారు.

ప్రవర్తన నియమావళి

అభ్యర్థుల ప్రవర్తనా నియమావళికి సంబంధించి 11అంశాలను ఇందులో పొందుపర్చారు. రాజకీయ పార్టీ ఏవిధంగా గుర్తింపు పొందుతుంది.. ఇందు కోసం ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే అంశాలను వివరించారు. ఎన్నికల సంఘం గుర్తులను ఎలా కేటాయిస్తుంది. ఓట్ల శాతం ఆధారంగా ఒక పార్టీని జాతీయ, ప్రాంతీయ పార్టీగా ఎలా గుర్తిస్తారో వివరించారు. పార్టీల ప్రచార సమయం, నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలను పాఠ్యాంశంలో పొందుపర్చారు.


పదోతరగతిలో ఎన్నికలపై పాఠ్యాంశం

విధులు..

ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్‌రోజున అధికారులు, ఏజెంట్ల విధులను వివరించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి. రాజకీయపార్టీలు, ఓటర్లు ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి సహకరించడం, పోలింగ్‌రోజు ఏ అధికారి ఏ విధులు నిర్వర్తిస్తారో తెలియజేశారు.

టీఎన్ శేషన్ సిఫార్సులు

భారత ఎన్నికల కమిషనర్‌గా 1990 నుంచి 1996 వరకు పనిచేసిన టీఎన్ శేషన్ ఎన్నికల నిర్వహణలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. వాటిని ఈ పాఠ్యాంశంలో పొందుపర్చారు.

- ఎన్నికల ప్రచార సమయాన్ని నామినేషన్ ఉపసంహరించుకునేందుకు నిర్ణయించిన తేదీ నుంచి 14 రోజులుగా నిర్ణయించారు.
- ఒక అభ్యర్థి ఒకేసారి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి పోటీ చేయరాదు.
- ఒక వ్యక్తి ఏదైనా నేరంలో కనీసం రెండేళ్ల జైలు శిక్ష అనుభవిస్తే ఆరేళ్లపాటు పోటీకి అనర్హులు.
- పోటీలో ఉన్న అభ్యర్థి మరణిస్తే ఎన్నిక వాయిదా వేయాలి. కానీ రద్దు చేయరాదు.
- ప్రచారం పూర్తయిన తర్వాత 48 గంటల వరకు మద్యం అమ్మకాలు నిషేధించాలి.

ఉపాధ్యాయులు అన్ని విషయాలు వివరించారు



ప్రజాస్వామ్యంలో సుపరిపాలన అందించే వ్యక్తులను ఎన్నుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని తెలిసింది. పాఠంలోని వివరాల ఆధారంగా మా ఉపాధ్యాయులు అన్ని విషయాలు వివరించారు. దీంతో ఓటు వేయడం ఎంత తప్పనిసరో మా అమ్మా నాన్నకు చెప్పా. – అభిరాజ్, పదోతరగతి, జెడ్పీహెచ్ఎస్, మల్లాపూర్

మంచి నిర్ణయం



పదో తరగతి సాంఘిక శాస్త్రంలో ఎన్నికల ప్రక్రియపై పాఠ్యాంశాన్ని ముద్రించడం అభినందనీయం. తద్వారా విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించడం సాధ్యమవుతుంది. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఈ పాఠం బోధిస్తే విద్యార్థులు ఆసక్తిగా విన్నారు.
– అరిగెల వెంకటరమణ, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, మల్లాపూర్, లక్ష్మణచాంద, నిర్మల్

ఉమ్మడి జిల్లాలో 3,741 బ్యాలెట్ యూనిట్ల వినియోగం

- ఏడు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి..
- మూడు చోట్ల రెండేసి..

చెన్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో 3,741 బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. పది నియోజకవర్గాలు ఉండగా.. ఏడు చోట్ల ఒక్కో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేస్తుండగా.. మూడు చోట్ల 16మంది కంటే ఎక్కువగా అభ్యర్థులు బరిలో ఉండడంతో ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఖరారు

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేసింది. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆసిఫాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కళాశాల, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం టెక్నికల్, ట్రెనింగ్ సెంటర్(టీటీడీసీ) ఆదిలాబాద్‌లో, ఖానాపూర్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం నిర్మల్‌లోని పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలు, అభ్యర్థులు, బ్యాలెట్ యూనిట్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	అభ్యర్థులు+నోటా	ఒక్కో పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ యూనిట్లు	నియోజకవర్గంలో బ్యాలెట్ యూనిట్లు
సిర్పూర్	294	13+1	1	294
చెన్నూర్	227	14+1	1	227
బెల్లంపల్లి	227	13+1	1	227
మంచిర్యాల	289	17+1	2	578
ఆసిఫాబాద్	305	17+1	2	610
ఖానాపూర్	305	11+1	1	305
ఆదిలాబాద్	290	25+1	2	580
బోథ్	302	10+1	1	302
నిర్మల్	306	13+1	1	306
ముధోల్	312	10+1	1	312

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన బ్యాగును తిరిగి అప్పగించిన సిబ్బంది నిజాయతీ చాటుకున్నారు. పట్టణానికి చెందిన సాధిక్ కుటుంబ సభ్యులు ఆదివారం కరీంనగర్ బస్టాండులో ఆదిలాబాద్‌వైపు వెళ్లే బస్సు ఎక్కారు. లక్సెట్టిపేటలో బస్సు దిగి బ్యాగు అందులోనే మర్చిపోయారు. ఇంటికి వెళ్లి చూసేసరికి బ్యాగు లేకపోవడంతో వెంటనే బస్టాండుకు వచ్చి ట్రాఫిక్ గైడ్ రవీందర్‌కు విషయం తెలిపారు. అతను వెంటనే బస్సు డ్రైవర్ మిట్టల్, కండక్టర్ విట్టల్‌కు ఫోన్ చేయడంతో బ్యాగు బస్సులోనే ఉన్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆర్టీసీ సిబ్బంది బ్యాగును బాధితులకు అప్పగించారు. బ్యాగులో బంగారం, నగదు ఉన్నట్లు సాధిక్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నిజాయతీతో బ్యాగు అప్పగించిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు.


సన్మానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ఎన్నికల అంశాలపై అవగాహన ఉండాలి

బెల్లంపల్లి: ఎన్నికల ప్రతీ అంశంపై సెక్టోరల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులను సెక్టోరల్ అధికారులు తెలుసుకుని ఉండాలని అన్నారు. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి పొరపాట్లకు తావులేకుండా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే సౌకర్యాలపై సెక్టోరల్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, లైట్లు, ఫ్యాన్లు, దివ్యాంగులు, వయోవృద్ధులు, వికలాంగులు, గర్భిణులకోసం ర్యాంపుల ఏర్పాటు, తాగునీరు, మూత్రశాలల ఏర్పాట్లపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి చర్యలపై అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై సెక్టోరల్ అధికారులకు అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, ఆర్వో రాహుల్

మతోన్మాద ఫాసిస్టు పార్టీలను ఓడించండి

ఎదులాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నియంతృత్వ, మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్ అన్నారు. నియంతృత్వ, మతోన్మాద ఫాసిస్టు పార్టీలను ఓడించాలంటూ రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని కుమ్రంభీమ్ భవన్ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగనున్న ఎన్నికలు ప్రజల చేతిలో ఒక వజ్రాయుధం లాంటివని అన్నారు. కేసీఆర్ రెండు దఫాలుగా గెలిచినా ప్రజలకు ఒరిగింది ఏమిలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ సంఘాలు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాండేకర్ వామన్, కొడప సురేశ్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూజాతాయి, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు రాజు, నితిన్, నాయకులు రాథోడ్ వామన్, అయ్యు పటేల్, బుచ్చిరాం, వినోద్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

'తుమ్మల'కు జాతీయ సాహితీ పురస్కారం

నిర్మల్‌ఖిల్లా: జాతీయ స్థాయిలో సాహిత్య రంగంలో కృషి చేస్తున్న వారికిచ్చే 'విమల సాహితీ సాహిత్య పురస్కారం' నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు, ఉపాధ్యాయుడు డాక్టర్ తుమ్మల దేవరావు అందుకున్నాడు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లోని దొడ్డి కొమురయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, తెలంగాణ శాసన మండలి సభ్యులు గోరేటి వెంకన్న, రిటైర్డ్ వైస్ చాన్సలర్, ప్రముఖ రచయిత డా.కొలుకలూరినాక్, ప్రముఖ అనువాదకుడు ప్రా. జీవీ.రత్నాకర్, ప్రముఖ కవి, వక్త డాక్టర్ కోయి కోటేశ్వరరావు, కళాశ్రేష్ఠ బిక్కి కృష్ణ, ప్రముఖ కవి, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జెల్ది విద్యాధర్, ప్రముఖ కవి డాక్టర్ దేవయ్య (కర్ణాటక) తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పురస్కార గ్రహీతల రచనలు ఇతర భాషల సాహిత్యంతో పోల్చలేనంత ఉన్నతంగా ఉన్నాయని కొనియాడారు. అయితే తుమ్మల దేవరావు గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు అందుకున్నారు. అనేక పరిశోధనా వ్యాసాలు రచించారు. కచ్చురం, గడ్డిపూలు, మట్టి పాదాలు, నిర్మల్ జిల్లా సాహిత్య చరిత్ర, నిర్మల్ కథలు తదితర పుస్తకాలు వెలువరించాడు. ఈ సందర్భంగా వీరిని నిర్మల్ సాహితీ మిత్రులు వైద్యుడు డాక్టర్ చక్రధారి, డాక్టర్ దామెరరాములు, పత్తి శివప్రసాద్, నేరెళ్ల హన్మంతు, రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు.


తుమ్మల దేవరావుకు పురస్కారం అందిస్తున్న గోరేటి వెంకన్న

'బీఆర్ఎస్‌కు ట్రస్మా మద్దతు'


మాట్లాడుతున్న శేఖర్‌రావు

జన్నారం(ఖానాపూర్): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ట్రస్మా పూర్తి మద్దతు ఇస్తుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సోమవారం కలమడుగులో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, వివిధ సమస్యల పరిష్కారానికి పార్టీ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఖానాపూర్ నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు తమవంతు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో 65 ప్రైవేట్ పాఠశాలలు, వెయ్యికి పైగా ఉపాధ్యాయులున్నారని, వారందర్నీ కలిసినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం రాత్రి 10గంటల అనంతరం దుకాణాలు తెరిచి ఉంచిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేశామని, ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

నగదు పట్టివేత


నగదు చూపుతున్న పోలీసులు

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ సమీపంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో నగదు పట్టుబడినట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి గ్రామానికి చెందిన సాత్పుతి రాజశేఖర్ మహారాష్ట్రలోని రాజూరా నుంచి వేమనపల్లికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ.1,64,150 నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు

మందమర్రిరూరల్(చెన్నూర్): సీఐటీయూ పోరాట ఫలితంగానే సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సోమవారం సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచౌరి పాస్ పుస్తకాలు పంపిణీ చేశారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.మధు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు వారికి సంబంధించిన పుస్తకాలను గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయానికి వెళ్లి తీసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురుని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.11050 నగదును స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు బాలికల అదృశ్యం

నిర్మల్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని అదృశ్యం కేసు నమోదైనట్లు పట్టణ ఎస్సై సుమలత తెలిపారు. వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలానికి చెందిన విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

నిర్మల్‌రూరల్: మండలంలోని లంగాడాపూర్ గ్రామానికి చెందిన రనావత్ దిబోరా అనే బాలిక అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలిక కుటుంబ సభ్యులు గ్రామంలో ఉంటూ జిల్లా కేంద్రంలో తిరుగుతూ బుగ్గలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులు ఫోన్ ఎక్కువగా చూస్తున్నావని కూతుర్ని మందలించడంతో సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కానరాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఇద్దరు బాలికల అదృశ్యం

భైంసాటౌన్: భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన సాదుల గంగోత్రి(8), సాదుల దీప(10) సోమవారం మధ్యాహ్నం భైంసా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి వెళ్లి తప్పిపోయారు. వారి తండ్రులు లక్ష్మీనారాయణ, సంపూర్ణం ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చినట్లు వెల్లడించారు.

గుడుంబా పట్టివేత

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ తండా కొట్టమద్దిపడగ, గంగాపూర్ గ్రామంలోని కు టుంబ స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ అధి కారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ పేర్కొన్నారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది ముత్యం, సాయి, హరీష్, నరేందర్, తదితులున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని సిద్దాపూర్ వాగులో సోమవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్సై జ్యోతి వివరాల ప్రకారం... వాగు పైనుంచి వెళ్తున్న వారికి నీటిపై మృతదేహం కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు లక్కన్(15) స్థానిక సోఫినగర్‌కు చెందినవాడిగా గుర్తించారు. ఆదివారం తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చౌహాన్ విఠల్ (52) రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై జివి రమణారెడ్డి వివరాల ప్రకారం .. విఠల్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఫైనాన్స్ తీసుకొని ఆటోను కొనుగోలు చేశాడు. తిరిగి డబ్బులు చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విఠల్‌కు భార్య శోభతాయి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాంద-టి శివారు ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని చినఅర్లి గ్రామానికి చెందిన అల్లూరి గణేష్ రెడ్డి (47) ఆదిలాబాద్ నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో చాందా-టి మైనార్టీ స్కూల్ ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. దీనిపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు

కోటపల్లి(చెన్నూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బోరంపల్లికి చెందిన ఇందుల రాజన్న సోమవారం 63వ జాతీయ రహదారి మీదుగా పరకాల నుంచి చెన్నూర్‌కు వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అందించి చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

అంత్యక్రియలకు ముందుకు..


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పేదరికంతో అంత్యక్రియలు చేయలేని ఓ కుటుంబానికి బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ మానవత్వంతో ముందుకొచ్చింది. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన దుబ్బాక లక్ష్మి అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబీకులు ఆ స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకురావడంతో ఆ సంఘం అధ్యక్షుడు అజీజ్ అంత్యక్రియల కోసం ఏర్పాటు చేశాడు. హిందు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లైంగికదాడి ఘటనలో ఒకరికి పదేళ్ల జైలు

చింతలమానెపల్లి(సిర్పూర్): మహిళపై లైంగికదాడి ఘటనలో రుద్రాపూర్ గ్రామానికి చెందిన దుర్గం తేజస్‌కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి రమేశ్ తీర్పునిచ్చారు. లైజనింగ్ అధికారి కె.సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ అధికారి బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన అత్యాచార ఘటనలో పోలీసులు దుర్గం తేజస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో నిందితుడికి 376(2), 417, 420 ఐపీసీ సెక్షన్ల కింద జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధించారు.

డ్రైవర్‌పై పలువురి దాడి

ఆదిలాబాద్‌టౌన్: స్పిన్నింగ్ మిల్లు వాహన డ్రైవర్‌పై పలువురు దాడి చేసిన ఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే కార్మికులను రాత్రి పూట ఇంటికి వదిలిపెట్టే క్రమంలో డ్రైవర్ షేక్ సమీర్ వాహనంలో తాటిగూడకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో క్రాంతినగర్ ఆటో స్టాండ్ వద్ద షేక్ సల్మాన్, సోయల్ ఖాన్, వజీర్, వినోద్ వాహనాన్ని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను కిందికి దింపి తాము ఎప్పుడు కనబడితే అప్పుడు నమస్తే పెట్టాలని బెదిరించి డ్రైవర్‌పై దాడి చేశారు. దీంతో ఖానాపూర్‌కు చెందిన డ్రైవర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు.

'బీసీల హామీలు విస్మరించిన బీఆర్ఎస్'

పాతమంచిర్యాల: బీసీలకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ పార్టీ విస్మరించిందని, ఆ పార్టీని ఎన్నికల్లో ఓడించాలని బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయిరాంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ప్రజాప్రతినిధుల సమావేశంలో 210 అంశాలతో కూడిన బీసీ పాలసీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి ఏడేళ్లు గడిచిందని తెలిపారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి చట్టం తీసుకొస్తామని చెప్పి కార్యాచరణ చేపట్టలేదని విమర్శించారు. బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు వంగల దయానంద్, నాయకులు గజెల్లి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు బోడెంకి మహేష్, శ్రీపతి రాములు, రాసమల్ల కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

- టీబీ కార్యాలయంలో మూలనపడ్డ నూతన ఎక్స్‌రే మిషన్
- మూడేళ్లవుతున్నా నో ఇన్‌స్టాలేషన్
- డిప్యూటేషన్‌పై టెక్నీషియన్
- రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు!


ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోని నూతన ఎక్స్‌రే యంత్రం


రిమ్స్‌లో ఎక్స్‌రే, స్కానింగ్ కోసం బారులు తీరిన రోగులు

ఆదిలాబాద్‌టౌన్: క్షయ(టీబీ) నిర్మూలన కోసం ప్రభుత్వాలు లక్షలు వెచ్చిస్తున్నా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. కొంతమంది వైద్యశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఎక్స్‌రే మిషన్‌ను టీబీ ఆస్పత్రికి పంపించింది. ఓ టెక్నీషియన్‌ను నియమించింది. ఇక్కడ ఉండి విధులు నిర్వర్తించాల్సిన ఆ ఉద్యోగి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో తన సొంత జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. దీంతో నూతన ఎక్స్‌రే మిషన్ ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోకపోవడం గమనార్హం. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దుస్థితి.

ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం..

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో టీబీ ఆస్పత్రి ఉంది. క్షయ వ్యాధి నిర్ధారణ కోసం రోజుకు పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తుంటారు. గతంలో రిమ్స్‌లో ఈ పరీక్షలు చేస్తుండగా, రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం మూడేళ్ల క్రితం టీబీ ఆస్పత్రికి సుమారు రూ.30 లక్షలు వెచ్చించి నూతనంగా ఎక్స్‌రే మిషన్ పంపించింది. అయితే అధికారుల అలసత్వం కారణంగా ఆ యంత్రం కాస్తా మూలనపడగా, రోగులు గతంలోలాగే రిమ్స్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి. ఇక్కడ యంత్రం ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని తెలుస్తోంది. జిల్లాలో వేతనం తీసుకుంటూ ఇతర జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వైద్యారోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులందరి డిప్యూటేషన్లు రద్దయినప్పటికీ ఈయన మాత్రం హన్మకొండలోనే దర్జాగా విధులు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక్కడ రోగుల పరిస్థితి ఏమిటి..?

టీబీ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్‌గా పనిచేసే ఉద్యోగి ఉన్నతాధికారులతో పైరవీలు చేసుకొని ఏడాది కాలంగా హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్‌లో టీబీ కార్యాలయం నుంచి వేతనం తీసుకుంటున్న ఆయన ఇక్కడ లేకపోవడంతో ఆ యంత్రం పనిచేయకుండా పోతోంది. ఆ ఉద్యోగిని టీబీ కార్యాలయానికి కేటాయించడంతోనే ప్రభుత్వం లక్షల విలువైన యంత్రాన్ని మంజూరు చేసింది. తీరా ఆయన డిప్యూటేషన్‌పై ఆయన సొంత జిల్లాకు వెళ్లడంతో ఇక్కడి రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. రిమ్స్ ఆస్పత్రిలో టీబీ నిర్ధారణ కోసం రోజుకు 20 నుంచి 30 మంది వరకు వస్తున్నారు. వీరందరిని ఎక్స్‌రే తీయించేందుకు అధికారులు రిమ్స్‌కు పంపిస్తున్నారు. దీంతో అక్కడ రద్దీ పెరిగి రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది.


ఆదిలాబాద్‌లోని టీబీ కార్యాలయం

రేడియోగ్రాఫర్ డిప్యూటేషన్‌పై ఉన్నారు

టీబీ కార్యాలయానికి కేటాయించిన రేడియోగ్రాఫర్ ఏడాదికి పైగా డిప్యూటేషన్‌పై ఉన్నారు. ప్రస్తుతం ఆయన హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నారు. టీబీ కార్యాలయానికి ప్రభుత్వం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ మంజూరు చేసింది. త్వరలోనే ఇన్‌స్టాలేషన్ చేయిస్తాం. ప్రస్తుతం రోగులను ఎక్స్‌రే కోసం రిమ్స్‌కు పంపిస్తున్నాం.

– సాయిప్రియ, టీబీ ప్రోగ్రాం అధికారి, ఆదిలాబాద్

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో రాధే రాధే ప్రభాత్‌భేరీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గోపాష్టమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మార్వాడి మహిళలు, పురుషులు రాధాకృష్ణ భవన్ నుంచి భజనలు, కీర్తనలతో గోశాలకు వెళ్లి అక్కడ కృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 56 రకాల నైవేద్యాలను గోవులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మున్నా లడ్డా, ప్రదీప్ లడ్డా, తదితరులు ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న మార్వాడి సంఘు సభ్యులు

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి

నిర్మల్ రూరల్: క్రీడల్లో విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి వుషూ, కిక్ బాక్సింగ్ సెలక్షన్స్‌లో లోకేశ్వరం, భైంసా, కుభీర్ కేజీబీవీల విద్యార్థులు, బాసరలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వారిని కలెక్టరేట్‌లో సోమవారం అభినందించారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి నఫీఖాన్, జీసీడీవో శ్రీదేవి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు, ట్రైనర్లు సాయికిరణ్, జితేందర్‌సింగ్, పీఈటీలు పాల్గొన్నారు.


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్

ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య తోపులాట

కౌటాల(సిర్పూర్): కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆయా పార్టీల నాయకులు రోడ్ షో నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హరీశ్‌బాబు రోడ్‌షో మార్కెట్ ఏరియా నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి ముందుగా చేరుకుంది. అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప తనయుడు వంశీకృష్ణ రోడ్ షో అక్కడికి చేరుకుంది. ఇరుపార్టీల ప్రచార వాహనాల ఎదుట కార్యకర్తలు నృత్యం చేయడంతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఒక దశలో ఇరువర్గాల మధ్యలో తోపులాట జరిగింది. సీఐ సాధిక్ పాషా, ఎస్సైలు మధుకర్, వెంకటేశ్, విక్రమ్ ఇరువర్గాలను శాంతిపజేసే ప్రయత్నం చేశారు. పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నరని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం హరీశ్‌బాబు ప్రచార వాహనం అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఉద్రిక్తత చల్లారింది. పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

టోంకిని ఆలయానికి పోటెత్తనున్న భక్తజనం

- కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు మహాపాదయాత్ర
- వేలాదిగా తరలిరానున్న ప్రజలు

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకినిలోని శ్రీసిద్ది టోంకిని హనుమాన్ ఆలయానికి మంగళవారం భక్తజనం పోటెత్తనున్నారు. ఏటా కార్తీకమాసం రెండో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా టోంకిని హనుమాన్ ఆలయం వరకు భక్తులు మహాపాదయాత్ర నిర్వహిస్తారు.

భక్తుల అపార నమ్మకం..

ఆలయంలో సిద్ది హనుమాన్‌ను దర్శించుకుని ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల అపార నమ్మకం. దీంతో ఏటా కార్తీక మాసంలో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కౌటాల, బెజ్జూర్ మండలాలు, మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర పట్టణాలైన వీరూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలతో పాటు గ్రామాల నుంచి వేలాది భక్తులు పాదయాత్రగా తరలివస్తారు.

భారీ బందోబస్తు...

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కౌటాల సీఐ సాదిక్ పాష, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సిర్పూర్(టి)–కాగజ్‌నగర్, సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారులతో పాటు ఆలయ సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వంద మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్టు సభ్యుడు జాబోర్ మారుతి తెలిపారు.


శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం


ఆలయంలోని సిద్ధి హనుమాన్ విగ్రహం

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేష్ మాట్లాడుతూ ఫీజుల పేరుతో ప్రిన్సిపాల్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫీజు చెల్లించకుంటే కళాశాలకు రావద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. అకారణంగా తొలగించిన లెక్చరర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

త్యాగాలు ప్రజలవి..భోగాలు కేసీఆర్‌వి

- పదేళ్లలో అంతులేని అవినీతి
- ఇవి తెలంగాణ దశ..దిశ మార్చే ఎన్నికలు
- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసింది ప్రజల వంతైంది.. స్వరాష్ట్రంలో భోగాలు కేసీఆర్‌కు దక్కాయని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్ల పద్మశాలి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సీపీఐ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు రాష్ట్ర దశ..దిశ మార్చేటివి అన్నారు. గతంలోని ప్రభుత్వాలు కట్టిన నాగార్జునసాగర్ తదితర ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదని, కేసీఆర్ హయాంలో ఇటీవలే నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఇన్నాళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు లక్షలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సీపీఐ నాయకులు సామల మల్లేశం, వెంకటస్వామి, పంతం రవి, కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌రెడ్డి, నాగుల సత్యనారాయణగౌడ్, ఎల్లె లక్ష్మినారాయణ, గోలి వెంకటరమణ, గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ దొరల పాలైంది

వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ దొరల పాలైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని, తెచ్చుకున్న స్వరాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుకుంటూ, దొరల నుంచి విముక్తి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

'సన్న' రైతులను బతికించాలని..

- సన్నరకం బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు
- గ్రామాల్లో బియ్యం ఉత్పత్తి సంఘాలతో రైతుకు ఆదాయం
- జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు

జగిత్యాల అగ్రికల్చర్: రైతులు ఐదారు నెలలు కష్టపడి, భోజనానికి ఉపయోగించే సన్నని వరి ధాన్యం పండించినప్పటికీ, మార్కెట్‌లో సరైన ధర రాక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులూ రాక, అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చి, విక్రయిస్తున్నారు. వినియోగదారులు ఈ బియ్యాన్ని కొనుగోలు చేస్తే అన్నదాతలకు కొంతలో కొంత ఉపశమనం కలుగుతుంది. ప్రస్తుతం మార్కెట్లో సన్న బియ్యం(క్వింటాల్‌కు).. బీపీటీ రకం రూ.3,800–రూ.4,000, జై శ్రీరాం రకం రూ.4,800–రూ.5,000, హెచ్‌ఎంటీ రకం రూ.4,000–రూ.4,200 వరకు ధరలు ఉన్నాయి.

జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో సాగు..

జగిత్యాల జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో బీపీటీ, హెచ్‌ఎంటీ, జై శ్రీరాం వంటి సన్న రకాల వరి ధాన్యం సాగు చేశారు. ఎకరానికి 18–20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 లక్షల క్వింటాళ్ల ధాన్యం పండింది. ప్రస్తుతం బీపీటీ రకానికి క్వింటాల్‌కు రూ.2,100–రూ.2,300, జై శ్రీరాం రకానికి రూ.2,500–రూ.2,800, హెచ్‌ఎంటీ రకానికి రూ.2,400–రూ.2,500 వరకు ఓపెన్ మార్కెట్‌లో రేటు పలుకుతోంది. ఇవి రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. అందుకే, చాలామంది ధాన్యాన్ని బియ్యంగా మారుస్తున్నారు.


గతంలో మార్కెట్‌లోకి విడుదల చేసిన లక్ష్మీపూర్ రైస్

బతికించాల్సింది వినియోగదారులే..

రైతులకు తమ పంట ఉత్పత్తులను కార్పొరేట్ కంపెనీలాగా ప్రచారం చేసుకొని, అమ్ముకునే స్తోమత లేదు. వారికి బతికించాల్సింది వినియోగదారులే. చాలా గ్రామాల్లో రైతులు సన్న వరి ధాన్యాన్ని మిల్లులో మర ఆడించి, నేరుగా వినియోగదారులకు అమ్ముతున్నారు. బియ్యాన్ని నేరుగా రైతుల వద్దే కొనుగోలు చేస్తే ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అన్నదాతలకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. లేకపోతే బియ్యం నలుగురైదుగురు దళారుల చేతులు మారి, రేట్లు పెరుగుతాయి. ఇది వినియోగదారులకూ నష్టమే.

బియ్యం ఉత్పత్తి సంఘాలు ఏర్పడాలి

సన్న వరి ధాన్యం పండించిన రైతులు ఆయా గ్రామాల్లో బియ్యం ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడాలి. వాటి ద్వారా ధాన్యాన్ని మర ఆడించేందుకు ఓ రైస్‌మిల్లర్‌తో మాట్లాడుకొని, బియ్యాన్ని నేరుగా సంఘాల ద్వారా అమ్ముకోవాలి. నగరాల్లో అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో తమ బియ్యం నాణ్యత చూపించి, ఆర్డర్లు తీసుకుంటే హాట్ కేకుల్లా అమ్ముడుపోయే అవకాశం ఉంటుంది.

అశోక్‌కుమార్ స్ఫూర్తితో..

గతంలో జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ కన్సల్టెంట్‌గా పనిచేసిన దన్నపునేని అశోక్‌కుమార్ గ్రామాలు తిరుగుతూ, సన్న వరి ధాన్యం అమ్మే బదులు బియ్యంగా అమ్మితే ఆదాయం పెరుగుతుందని రైతుల్లో చైతన్యం కలిగించారు. దీంతో జగిత్యాల మండలంలోని లక్ష్మీపూర్, కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి, మేడిపల్లి మండలంలోని తొంబర్రావుపేట వంటి గ్రామాల్లో రైతులు సంఘాలుగా ఏర్పడ్డారు. ఆయా గ్రామాల పేరుతోనే బియ్యం విక్రయించడం ప్రారంభించారు. వీరిని చూసి, చాలా పల్లెల్లో రైతులు బియ్యాన్ని నేరుగా వినియోగదారులకే విక్రయిస్తున్నారు.

రైతులను కలవండి



వినియోగదారులు రైతులను కలిస్తే, బియ్యం పట్టించి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. చాలా మంది అన్నదాతలు ఎవరైనా కొంటారో, కొనరోనని భావించి, ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు.

– గడ్డం సత్యనారాయణరెడ్డి, నాగారం, ధర్మపురి మండలం

నమ్మకంగా కొనుగోలు చేయండి




రైతులను బతికించడాన్ని వినియోగదారులు తమ బాధ్యతగా తీసుకోవాలి. బియ్యాన్ని నేరుగా వారివద్దే కొనుగోలు చేస్తే ఆ తృప్తి వేరేలా ఉంటుంది. నమ్మకమైన రైతు దగ్గర బియ్యం కొనుగోలు చేసి, చూడండి.

– అశోక్‌కుమార్, రిటైర్డ్ జిల్లా వ్యవసాయాధికారి

మోటార్లకు విశ్రాంతి

- 2019 జూలై 31న తొలి మోటారుకు వెట్‌రన్
- నాలుగేళ్ల వ్యవధిలోనే మేడిగడ్డలో అంతరాయం
- బ్యారేజ్ కుంగడంతో నీటిని ఖాళీ చేసిన అధికారులు


నిలిచిపోయిన ఎత్తిపోతలు

రామగుండం: సముద్రంలో కలుస్తున్న వృథా నీటిని రివర్స్ పంపింగ్ పద్ధతిన సద్వినియోగం చేసుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేశారు. స్వల్ప వ్యవధిలోనే ప్రఖ్యాత ఇంజినీరింగ్ డిజైన్‌తో రూపుదిద్దుకున్న కాళేశ్వరం.. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా ప్రాచుర్యం పొందింది. నీటిని ఒడిసి పట్టుకునేందుకు గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాంతాల్లో బ్యారేజీలు నిర్మించారు. ఎత్తిపోతల ద్వారా గోదావరి నదిపై ఎగువన నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు. దీనిని కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–1 కింద చేర్చారు. అయితే, నాలుగేళ్ల వ్యవధిలోనే పిల్లర్లు కుంగి రూ.కోట్లు నీటిపాలయ్యాయని ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

బ్యారేజీ కుంగడంతో నిలిచిన ఎత్తిపోతలు..

మేడిగడ్డ లక్ష్మీబ్యారేజ్ బీ బ్లాక్ 18, 19, 20, 21 పిల్లర్ల మధ్య వంతెన ఒక అడుగు మేర కుంగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ కంపెనీ పునరుద్ధరణకు సిద్ధమైంది. తొలుత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని నీటిని దిగువకు వదలడంతో బ్యారేజీలు ఖాళీ అయ్యాయి. అయితే, పునరుద్ధరణ తర్వాత ఎత్తిపోతలకు ఎంతసమయం పడుతుందనే అంశంపై అధికారుల వద్ద స్పష్టత లేదు. ఫలితంగా భారీ విద్యుత్ మోటార్లకు విశ్రాంతి లభించింది.

మెట్ట భూములను తడిపేందుకు..

భూ ఉపరితలంపై నీటి ప్రవాహం సాధారణమే అయినా.. మెట్ట(ఎత్తు పల్లంలో) ప్రాంతాల భూములను తడిపేందుకు ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకం వినియోగిస్తారు. ఫలితంగా అన్‌సీజన్‌లో సైతం ఆయకట్టుకు సరిపడా వరద నీటిని సమృద్ధిగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

గోలివాడ (పార్వతీ) పంపుహౌస్ ప్రాధాన్యం..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో గోలివాడ (పార్వతీ) పంపుహౌస్ నిర్మించారు. 2018 డిసెంబర్ 16న అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ దీనిని ప్రారంభించారు. 18 నెలల వ్యవధిలోనే పనులు పూర్తిచేశారు. పంపుహౌస్ నిర్మాణం కోసం 380.36 ఎకరాలు సేకరించారు. పార్వతీ పంపుహౌస్‌లో 9 భారీ విద్యుత్ మోటార్లు బిగించారు. ఒక్కోదాని సామర్థ్యం 40 మెగావాట్లు కాగా 24 గంటల్లో ఒక్కో మోటారు 2,600 క్యూసెక్కులు ఎత్తిపోస్తుంది. అన్ని మోటార్లు నడిపితే 23,308 క్యూసెక్కుల నీరు పంపింగ్ అవుతుంది. తొలి మోటారు 2019 జూలై 31న రాత్రి వెట్‌రన్ నిర్వహించారు. దశలవారీగా అన్ని మోటార్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. పంపుహౌస్ నిర్మాణం కోసం రూ.1,700 కోట్లు వెచ్చించారని అధికారులు తెలిపారు.

నిరుత్సాహంలో మత్స్యకారులు..

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు నిలిచిపోవడంతో మత్స్యకారులు నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఎత్తిపోతలతో పంపుహౌస్ నుంచి ప్రాజెక్టు వరకు ఉన్న అప్రోచ్ కాలువ నిల్వ నీటిలోకి టన్నుల కొద్దీ మత్స్య సంపద వచ్చి చేరుతుంది. మత్స్యకారులు తెప్పల సాయంతో చేపలవేట కొనసాగించేవారు. వీరి నుంచి చేపల కొనుగోలుకు సుదూర ప్రాంతాల నుంచి హోల్‌సెల్ వ్యాపారులు పెద్దసంఖ్యలో తరలివచ్చేవారు. స్వచ్ఛమైన నీటిలోని తాజా చేపలకు డిమాండ్ అధికంగా ఉండేది. ఎత్తిపోతలు నిలిచిపోవడంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది.


పంపుహౌస్‌లో బిగించిన భారీ మోటార్లు

పర్యాటకులకూ నిరాశే..

ఏటా డిసెంబర్‌లో ఎత్తిపోతలు ప్రారంభించేవారు. ఈసారి మేడిగడ్డ ఘటనతో ఎత్తిపోతల ఆగిపోయింది. ఎత్తిపోతలు ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు పునరుద్ధరించి లీకేజీలను పరిశీలించి బ్యారేజీలను నీటితో నింపాల్సి ఉంది. అప్పటివరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంపుహౌస్‌ల్లోని మోటార్లు మూగబోనున్నాయి. కాగా, చాలాకాలం వరకు మోటార్లను రన్ చేయకుంటే తుప్పు పట్టే ప్రమాదం ఉండడంతో డ్రైరన్ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలపై సంబంధిత శాఖ అధికారిని 'సాక్షి' సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

బీఎస్పీతోనే పేదల బతుకులు మారుతాయి

ధర్మపురి: బీఎస్పీ ద్వారానే పేదల బతుకులు మారుతాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ముందుగా వివేకానంద చౌరస్తా నుంచి పటేల్ విగ్రహం వరకు రోడ్‌షో చేపట్టారు. పార్టీ అధినేత మాయావతి ఆదేశాల మేరకు తెలంగాణలో పోటీకి సిద్ధమయ్యామని తెలిపారు. బడ్జెట్‌లో బీసీల వాటా కోసం ప్రశ్నించేందుకు.. కులగణన ఎందుకు చేపట్టడం లేదో తెలియజేసేందుకే ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల మధ్యకు వచ్చానని వెల్లడించారు. తనకు ప్రజాబలమేనని పేద ప్రజల బలంతోనే ముందుకు వచ్చాన పేర్కొన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో దొరలపాలనకు మంగళం పాడాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

'కేసీఆర్ అహంకారానికి నిదర్శనం'

జగిత్యాలటౌన్: దేశంలో సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేసిన ఇందిరా గాంధీపై సీఎం కేసీఆర్ విమర్శలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'ఇందిరమ్మ రాజ్యమా.. తోకమట్టానా..' అని మాట్లాడడాన్ని ఖండించారు. ఓటమి భయంతో కేసీఆర్ విచక్షణ మరిచిపోయి మాట్లాడుతున్నారని తెలిపారు. భూసంస్కరణలు చేపట్టి పేదలకు మిగులు భూములు పంచిన ఘనత ఇందిరాగాంధీదని గుర్తుచేశారు. కేసీఆర్ రాజకీయ ఓనమాలు నేర్చుకున్నది కాంగ్రెస్ పార్టీలోనే అన్న విషయం మరువరాదని సూచించారు. ఆయన వెంట గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, కల్లెపెల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, చందా రాధాకిషన్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి